క్లుప్తంగా

సమస్యలపై పోరాటాలకు ఉద్యోగులు సిద్ధం కావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు జీవన్ చంద్రశేఖర్, కృష్ణకుమార్, కేపీ రొనాల్డ్ శ్యాముల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం చేస్తున్న కార్యక్రమాలకు మద్దతుగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ఎస్ఎస్ సొల్యూషన్స్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సెంటర్ మేనేజర్ యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, స్పోకన్ ఇంగ్లీషు, ట్యాలీ ఈఆర్‌పి 9.0 విత్ జీఎస్టీ కోర్సులకు నాలుగు నెలలపాటు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 81060 59836, 99089 74770 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు సాహితీ సదస్సు

కడప కల్చరల్: నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరుకు చెందిన పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు జీవితం–సాహిత్యం అంశంపై ప్రసంగించనున్నారు.

నేడు తిరుపతిలో ఏపీటీఎఫ్ జూబ్లీసభ

వైవీయూ : తిరుపతి నగరంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అధికార ఉద్యమ పత్రిక 'ఉపాధ్యాయ' 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఈనెల 26న ప్లాటినం జూబ్లీ వేడుక నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ కార్యకర్తలు పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

పండ్లు పంపిణీ

కడప కల్చరల్ : ఇటీవల మృతి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ రాయల్ రషీద్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాయల్ షబ్బీర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ముస్లిం ఆర్ఫనైజ్‌లో పండ్లు పంపిణీ చేశారు. అక్కడి బాలలకు పండ్లు అందజేసి బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం పాత రిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో బ్రెడ్లు, స్వీట్లు, పండ్లు అందజేశారు. రాయల్ రషీద్ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, ముస్లిం ఆర్ఫనైజ్ మేనేజర్ హాజీ ఖాన్, ముస్తాక్, ఆదరణ వసతి గృహం మేనేజర్ అనూష పాల్గొన్నారు.

మార్చి 2న ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జగనన్న గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు కేటాయించాలని కోరుతూ మార్చి 2న విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జగనన్న గృహ నిర్మాణానికి రూ.5లక్షలు, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ విజయవాడలో చేస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. జగనన్న కాలనీలో మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమస్యలపై చేస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులి కృష్ణమూర్తి, నాగ సుబ్బారెడ్డి, కెసీ బాదుల్లా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

శనగల కొనుగోలులో అక్రమాలను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం శనగల కొనుగోలులో అక్రమాలను అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శనగల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలన్నారు. మార్కెట్ యార్డులో శనగలు కొనుగోలు చేస్తున్నారని, దళారులు క్వింటాకు రూ. 100లు అదనంగా తీసుకుంటున్నారని తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. రైతులకు గరిష్ఠంగా 20 క్వింటాలు మ్రామే కొనుగోలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణయ్య పాల్గొన్నారు.

6న తిరువణ్ణామలైకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఈ నెల 6న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోల నుంచి బస్సులు నడుస్తాయని ఆయన పేర్కొన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ఏర్పాటు చేసిన ఈ సర్వీసులను భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు.

పన్నుల వసూళ్లు పక్కాగా చేయాలి



అర్బన్ హెల్త్ సెంటర్‌లో మందులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, నీటి పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం 32వ డివిజన్ సచివాలయం, నకాష్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో సెక్రటరీల హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్లు, సర్వీసు రిజిస్టర్లు పరిశీలించారు. నగర పరిధిలో అన్ని అప్రూవల్స్ రిజిస్టర్‌లో పొందు పరచాలని, ఇంటిపేరు మార్పు దరఖాస్తులను సచివాలయంలోనే దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నకాష్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పిల్లలకు తల్లిపాలే సురక్షితమని, పేద పిల్లలకు ఉచిత టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. ల్యాబ్ వైద్య పరీక్షల పట్టికలను ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులు వైద్యం కోసం వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమయ్యే మందులను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు.

టీబీ కాంప్లెక్స్‌లో నగరపాలక అధికారుల దాడులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న టీబీ కాంప్లెక్స్‌పై కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో నగరపాలక అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన 16 షాపులను సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. నగరపాలక సంస్థ సమీపంలో ఉన్న ట్రావెర్స్ బంగళా కాంప్లెక్స్‌లో 20 షాపులను వివిధ వర్గాల వారికి లీజుకిచ్చారు. ఒకరిద్దరు తప్పా అందరూ వాటిని వేరొకరికి సబ్ లీజుకిచ్చి కార్పొరేషన్‌కు తక్కువ బాడుగ చెల్లిస్తూ, వారు ఎక్కువ బాడుగ వసూలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు మూడేళ్లక్రితం లీజు మొత్తాన్ని పెంచగా, లీజుదారులు దాన్ని చెల్లించకుండా కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. మూడేళ్లుగా బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈనేపథ్యంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్ తమ అధికారులు సిబ్బందితో శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా షాపులపై తనిఖీలు నిర్వహించి అసలు లీజుదారులు ఎవరు, వారు ఎవరికి సబ్ లీజుకిచ్చారు, ఏ జీఎస్టీపై వ్యాపారం నిర్వహిస్తున్నారు, షాపుల్లో ఏవైనా పార్టీషన్లు చేశారా వంటి వాటిని పరిశీలించి నిబంధనలు అతిక్రమించిన 16 షాపులను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఆర్ఓలు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే ఆత్మసంతృప్తి

సమగ్రశిక్షా అభియాన్ అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి



రామాంజులరెడ్డి దంపతులను సన్మానిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : అంకితభావంతో పనిచేసేవారికి ఆత్మసంతృప్తి ఉంటుందని సమగ్రశిక్ష అభియాన్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లిలోని సహితవిద్య రీసోర్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రామాంజుల రెడ్డిని శనివారం కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

సహితవిద్య సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి మాట్లాడారు. అనంతరం రామాంజులరెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ సెక్టోరియల్ అధికారులు ధనలక్ష్మి, దశరథ రామిరెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

వైవీయూ : నిరుద్యోగ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించడం హర్షణీయమని, అదే సమయంలో వారి జీవితాలకు భరోసా కల్పించడంతో పాటు హక్కులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మధుసూదన్ రెడ్డి, హరికృష్ణ, వివేకానంద, కొండయ్య, సాయి, షేక్షా, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

నగరవనం పనులు ప్రారంభం

ప్రధాన ద్వారంలో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేయనున్న భారీ ఆర్చి



జేసీబీతో కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న నగరవనం పనులను శనివారం ప్రారంభించారు. ఏకోపార్కు ఎదురుగా 80 ఎకరాల్లో ప్రభుత్వం నగరవనం ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఈ పనులను కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి క్షేత్రఅధికారి దినేష్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. అలాగే పనికి రాని మొక్కలు, వృక్షాల తొలగింపు పనులను వేగవంతంగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నగరవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. నగరవనం ప్రధాన ద్వారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే భారీ ఆర్చిని నిర్మించనున్నారు. ప్రొద్దుటూరు ప్రతిష్టను పెంచేలా ఉన్న చిహ్నాలు, ఫొటోలను ఆర్చిలో పొందుపరచాలని అటవీఅధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రొద్దుటూరులోని మేధావులు, ప్రజలు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని అటవీశాఖ అధికారులు సందీప్‌రెడ్డి, దినేష్‌కుమార్‌రెడ్డి కోరారు.

కడపలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



కడప ఒన్‌టౌన్ పరిధిలో తనిఖీలు చేస్తున్న సీఐ ఎన్‌వి నాగరాజు



కడప తాలుకా సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో తనిఖీలు

కడప అర్బన్ : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శనివారం కడప నగరంలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు.

- కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో లోహియా నగర్‌లో సీఐ ఉలసయ్య, ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు.
- కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నానాపల్లిలో ఎస్ఐ ఎస్‌కే రోషన్ ఆధ్వర్యంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.
- కడప రిమ్స్ పిఎస్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో, ఇతర అనుమానిత ప్రాంతాల్లో సీఐ రామచంద్ర, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.
- కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్రాల గడ్డలో ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. బుగ్గవంక ప్రహరీ వెంబడి తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో తనిఖీల సమయంలో హెచ్చరించారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించాలి



ద్వాదశ జ్యోతిర్లింగాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లెలో శనివారం సాయంత్రం ఓంశాంతిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఓంశాంతిలు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో కొలువు తీరిన ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను భక్తుల సందార్శనార్థం ప్రజాపిత బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేశామన్నారు. నాలుగు రోజుల పాటు ఈ దర్శనం ఉంటుందని తెలిపారు. 30 అడుగుల వాయులింగం, నవదుర్గ, అష్టలక్ష్మిలను కొలువు తీర్చారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటలకు నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ శిష్య బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పుత్తూరుకు చెందిన రమణి బెహన్‌జీ, రాజస్థాన్‌కు చెందిన చంద్రశేఖర్, చెన్నైకు చెందిన విశ్వనాథ్ భాయ్, రవి భాయ్, మోక్షగుండం వీధి ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు పావని బెహన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలో 60 ఏళ్ల కిందట రజకులకు కేటాయించిన దోబీఘాట్ స్థలంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని పలువురు రజకులు కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు వారు ఆర్డీఓను కలిసి సమస్యను వివరించారు. తాను ఆలయ నిర్మాణం చేపట్టగా తహసీల్దార్ అడ్డుకుని నిలుపుదల చేశారన్నారు. ఈ విషయంగా తమ మనోభావాలనుగౌరవిస్తూ ఆలయ నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రజక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేతిగుంట్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు స్వాధీనం

పోరుమామిళ్ల: రంగసముద్రం చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌డీఓ వెంకట రమణ ఆదేశాలతో తహశీల్దారు విజయకుమారి, సిబ్బంది శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. రెండు జేసీబీలు, రెండు టిప్పర్లు, 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

మామిడితోట దగ్ధం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం మామిడితోటకు నిప్పంటుకుని రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు కాకర్లమాధవరెడ్డి తెలిపారు. రైతు తెలిపిన వివరాల మేరకు.. పక్కనే ఉన్న తిప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారని, అది కాలుకుంటూ మామిడితోటకు పక్కన ఉన్న జామాయిల్ తోట అంటుకుని మామాడిచెట్లు కాలిపోయాయని తెలిపారు. ఎకరా అరటిపంట, డ్రిప్ వైర్లు పూర్తిగా కాలిపోయాయన్నారు. పోరుమామిళ్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు.

జామాయిల్ తోట ...

కలసపాడు : మండలంలోని మామిళ్లపల్లెకు చెందిన పెద్దిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పెద్దిరెడ్డి రాజా నారాయణమ్మలకు చెందిన 6 ఎకరాల జామాయిల్ తోటకు శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో జామాయిల్ తోట దగ్ధమైంది. పోరుమామిళ్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయం 30వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు గంగమ్మ తల్లికి బోనాల ఉత్సవంతో ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు భక్తులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలకు వేలం పాట ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు ఆరుపళ్ల దూడల విభాగానికి చెందిన వృషభరాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన యజమానులకు రూ.30, రూ.15, రూ.10 నగదు బహుమతులు ఉంటాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు గంగమ్మజాతర

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం మొదటి ఆదివారం జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.సురేష్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల గంగమ్మ జాతర ముగిసిన తర్వాత నిర్వహించే వారాల్లో భాగంగా ఆదివారం మొదటి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన వివరించారు.

టీకా కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలి



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు

బద్వేలు అర్బన్ : ప్రత్యేక వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు తెలిపారు. స్థానిక కోటవీధి ఆరోగ్య కేంద్రం, గాండ్లవీధి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన టీకా కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందించే వివిధ రకాల టీకాలను తప్పనిసరిగా వేయాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా నిర్దేశించిన సమయానికి టీకాలు వేయించుకోవాలన్నారు. సకాలంలో అన్ని రకాల టీకాలు పిల్లలకు వేయించడం ద్వారా 12 ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. అలాగే గర్భిణులకు కూడా వ్యాధినిరోధక టీకాలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది ఖాజా, రెడ్డెయ్య, మునిరెడ్డి, ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక బహిరంగ సభ



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న జమా అతె ఇస్లామి హింద్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జమా అతె ఇస్లామి హింద్ ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పట్టణాధ్యక్షుడు డీఎం షరీఫ్ పేర్కొన్నారు. శనివారం జమా అతె ఇస్లామి హింద్ కార్యాలయంలో ఆధ్యాత్మిక సభ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో జమా అతె ఇస్లామి హింద్ జాతీయ, రాష్ట్ర నాయకులు, ఇస్లాం ధార్మిక పండితులు పాల్గొంటారని వివరించారు. ఈ సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హుసేన్ అహ్మద్, అబ్దుల్ సమాద్, జిలాన్ బాషా, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అలరించిన వెంకట్



వెంకట్, విశాలక్షిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు క్రైం : విభిన్న ప్రతిభావంతుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కామిశెట్టి వెంకట్ తన పాటలు, నృత్యము, డైలాగులతో విద్యార్థులను అలరించాడు. మండలంలోని కొత్తపేట ఎంపీపీ పాఠశాలలో శనివారం వెంకట్, తల్లి విశాలక్షి సందర్శించారు. సంగీతం, లిప్ రీడింగ్, విద్యార్థులకు స్ఫూర్తి నింపే కార్యక్రమాలను వెంకట్ ప్రదర్శించాడు. వెంకట్ తల్లి విశాలక్షి విద్యార్థులతో మాట్లాడారు. లక్ష్యాన్ని నిర్ణయించుకోవడం, ఆత్మవిశ్వాసం, ధృడ సంకల్పం గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హిమజా, ఉపాధ్యాయులు చదువులబాబు, రమాదేవి, ఖాసీమ్‌సాహెబ్ సిబ్బంది వెంకట్, విశాలక్షిని సన్మానించారు.

అడవికి నిప్పు



జేఎంజే కళాశాల సమీపంలో ఎగసిపడుతున్న మంటలు

- ప్రమాదంలో జీవరాశుల మనుగడ
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

కడప కార్పొరేషన్ : వేసవి కాలం సమీపించడంతో జిల్లాలో అనేక చోట్ల అడవికి నిప్పు రాజుకుంటోంది. ఫలితంగా అడవుల్లో ఉన్న జీవ రాశుల మనుగడ ప్రమాదంలో పడుతోంది. ముఖ్యంగా కడప నగర శివార్లలోని పాలకొండలు, జేఎంజే సమీపంలో, సిద్ధవటం పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ప్రతిరోజూ ఏదో ఒకచోట అడవులకు నిప్పు పెడుతున్నారు. సాయంత్రమయ్యే సరికి ఈ మంటలు దావానలంలా వ్యాపించి రహదారులపైకి పాకుతున్నాయి. ఈ మంటల వల్ల అడవుల్లో ఉండే వన్యప్రాణులు, జీవరాశులు కాలి బూడిదయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అడవులకు ఎవరూ నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అటవీ అధికారులు చోద్యం చూస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజుకున్న మంటలను ఆర్పడం, అడవులకు ఎవరూ నిప్పు పెట్టకుండా నిఘా పటిష్ఠం చేయడం వంటి వాటి ద్వారా వీటిని నియంత్రించే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

శనగల కొనుగోలు కేంద్రం పరిశీలన



శనగలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

దువ్వూరు : మండల పరిధిలోని పెద్దజొన్నవరం ఆర్‌బీకేలో శనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగల పండించిన రైతుల నుంచి క్వింటా రూ.5,335తో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. రైతులు ఎవరూ దళారులను ఆశ్రయించొద్దని చెప్పారు. శనగల కొనుగోలు కేంద్రంలో తరరుగులు, అక్రమాలు జరిగేందుకు వీలు లేదని పేర్కొన్నారు. శనగలు విక్రయించిన తర్వాత రైతులు వారి ఖాళీ సంచులను తీసుకెళ్లవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఏఓ అమరనాథ్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వీరనారాయణరెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌ను పరిశీలించిన డీఈఓ



ఆయా గంగాదేవిని సన్మానిస్తున్న డీఈఓ దేవరాజు

అట్లూరు : సోమేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి సి.దేవరాజు పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నించారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. మధ్యాహ్నం పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడంతో ఆయాగా పనిచేస్తున్న శీలం గంగాదేవిని సన్మానించారు.

వాహనాల స్పెషల్ డ్రైవ్

కడప అర్బన్: జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో శనివారం మొత్తం 274 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 230 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహన చోదకులపై 44 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు.

సమాజసేవకు పాటుపడాలి



మాట్లాడుతున్న స్థైర్యానంద సరస్వతి స్వామీజీ

కమలాపురం : ఏయిమ్ ఫర్ సేవ విద్యార్థులంతా అనాథలు కారని, మీకందరికీ మేమంతా అండగా ఉన్నామని, మీరు మంచి చదువులు అభ్యసించి సమాజసేవకు పాటు పడాలని శ్రీ విద్యాపీఠం పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి తెలిపారు. శనివారం స్థానిక ఏయిమ్ ఫర్ సేవా (ఛాత్రాలయం) 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయిమ్ ఫర్ సేవ వ్యవస్థాపకులు స్వామి దయానంద సరస్వతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథ విద్యార్థులను అక్కున చేర్చుకుని వారికి మంచి భవిష్యత్తు ఇద్దామని స్వామి దయానంద సరస్వతి పలు దేశాల్లో ఇలాంటి సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అడ్మినిస్ట్రేటర్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఛాత్రాలయంలో ఇప్పటి వరకు టెన్త్ క్లాస్ వరకు మాత్రమే విద్య నందించేవారన్నారు. ఇకపై ఇంటర్, డిగ్రీలో సైతం తమ కళాశాలలో చదివిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టెన్త్ పాస్ అయిన విద్యార్థులంతా పాలిటెక్నిక్ కళాశాలలో చేరితే మంచి విద్యనందించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫిజిక్స్ ఉపాధ్యాయులు రాఘవ చంద్రశేఖర్, సెక్రటరీ అల్లె రాజారెడ్డి, కమిటీ మెంబర్లు ఎస్‌సీ పుల్లారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వేసిన ఆసనాలు ఆకట్టుకున్నాయి.కమిటీ సభ్యులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, రెడ్డి సురేష్, సీవీ సుబ్బరాజు పాల్గొన్నారు.